ఎట్టకేలకు కల సాకారం

- నావూరు వాగుపై బ్రిడ్జి నిర్మాణం
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిధుల మంజూరు
- దశాబ్దాల నాటి సమస్యకు పరిష్కారం
- మరో నెల్లో పనులు పూర్తి

పొదలకూరు : దశాబ్దాల నాటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. వర్షాకాలమొస్తే కొన్ని గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయేవి. అత్యవసర పనుల నిమిత్తం వెళ్లాలనుకునే వారు పొంగిపొర్లే పెద్ద వాగును దాటలేక తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రభుత్వాలు మారినా, ఆ గ్రామాలకు పరిష్కార మార్గం లభించలేదు. అయితే గత ప్రభుత్వ హయాంలో వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.3.62 కోట్లు మంజూరయ్యాయి. ఇప్పుడా పనులు వేగంగా జరుగుతున్నాయి. గతేడాది జనవరిలో పనులను ప్రారంభించేందుకు సంబంధిత కాంట్రాక్టర్లు యత్నించారు. అయితే వాగులో నీటితో పనులను ప్రారంభించలేకపోయారు. పనుల కోసం డైవర్షన్ రోడ్డును పూర్తి చేశారు. తర్వాత ఎన్నికల నియమావళి, తదితర కారణాలతో పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం నెల రోజులుగా పనులు ఊపందుకున్నాయి. బ్రిడ్జి నిర్మాణాన్ని మరో నెల్లో పూర్తి చేసేందుకు అధికారులు యత్నిస్తున్నారు.



నావూరు పెద్దవాగు బ్రిడ్జి నిర్మాణ పనులు

వాగు పొంగితే రాకపోకలు బంద్

మండలంలోని నావూరు పెద్ద వాగుపై నాలుగు దశాబ్దాల క్రితం చప్టాను అప్పటి ఆత్మకూరు ఎమ్మెల్యే సుందరామిరెడ్డి నిర్మించారు. అప్పటి నుంచి వాగు వర్షాకాలంలో పొంగి ప్రవహించి రెండు, మూడు రోజులకు తగ్గిపోయేది. అయితే తుఫాన్ల ప్రభావంతో భారీ వర్షాలు కురిస్తే వారం, పది రోజుల పాటు వాగు పెద్ద ఎత్తున ప్రవహించడంతో నావూరు, చెన్నారెడ్డిపల్లి, భోగసముద్రం, కొండలరాయుడుకండ్రిక తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయేవి. ఈ గ్రామాల ప్రజలు ఎందరో నాయకులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా, నిధుల లేమి తదితర కారణాలతో పరిష్కారానికి నోచుకోలేదు. గత ప్రభుత్వ హయాంలో మంత్రిగా ఉన్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి 2023లో నావూరు రోడ్డు పనులతో పాటు బ్రిడ్జి నిర్మాణానికి నిధులను సాధించారు.

వేగంగా పనులు

బ్రిడ్జి నిర్మాణానికి వాగు నీరు అడ్డంకిగా మారడంతో పనులు చాలా రోజులు నిలిచిపోయాయి. 20 శాతం పనులు పురోగతిలో ఉంటే ఆపకుండా చేపట్టాలని కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ఇప్పుడు వేగంగా జరుగుతున్నాయి. వాగు నీరు ఇప్పటికీ స్వల్పంగా ప్రవహిస్తున్నా, మోటార్ల ద్వారా పంపింగ్ చేసి పనులను చేపడుతున్నారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే రాకపోకలను నిరంతరాయంగా కొనసాగించేందుకు అవకాశం కలుగుతుందని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు.

త్వరగా పూర్తి చేస్తాం

బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేస్తాం. వర్షాలు కురిసి వాగు పొంగిపొర్లినా నీరు వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. పనులను వర్షాకాలంలోపు పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నాం.

– సుధాకర్, ఏఈ, పీఆర్ ప్రాజెక్ట్స్



చప్టాపై వర్షాకాలంలో ప్రవహిస్తున్న నీరు (ఫైల్)

ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి తీగల చోరీ

పొదలకూరు: మండలంలోని ఆల్తుర్తి పంచాయతీ పొడమేకలకండ్రిక పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైన అంశాన్ని రైతులు ఆదివారం గుర్తించారు. గ్రామస్తుల వివరాల మేరకు.. ట్రాన్స్‌ఫార్మర్‌ను స్తంభం నుంచి కిందికి దించి పగలగొట్టి అందులోని తీగలను చోరీ చేశారు. ఆల్తుర్తి పంచాయతీ పరిధిలో ఇప్పటి వరకు నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురవడంతో రైతులు హడలిపోతున్నారు. ఈ మేరకు విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు.

చికెన్ వ్యర్థాల వాహనాల పట్టివేత

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని పెనుబల్లి గ్రామం వద్ద ఆదివారం వేకువజామున చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న మూడు వాహనాలు, రెండు బైకులను స్థానిక యువకులు, గ్రామస్తులు పట్టుకున్నారు. అనంతరం ఎస్సై సంతోష్‌కుమార్‌రెడ్డికి సమాచారం అందించారు. ఆయన ఘటనా స్థలానికి చేరుకుని వాహనాలను పెన్నానదికి తరలించి వ్యర్థాలకు పంచనామా నిర్వహించిన తర్వాత వాహనాలను స్టేషన్‌కు తరలించారు. బాధ్యులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు



విశేషాలంకారంలో మనుబోలమ్మ

మనుబోలు: మనుబోలు గ్రామదేవతలు మనుబోలమ్మ, నాగార్పమ్మకు ప్రత్యేక పూజలను ఆదివారం నిర్వహించారు. విశేష పూజా కార్యక్రమాలను అర్చకుడు ఫణీంద్రశర్మ ఆధ్వర్యంలో జరిపారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో గ్రామదేవతలను దర్శించుకొని సలిపిండి, పానకాలను నైవేద్యంగా సమర్పించారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

నెల్లూరు సిటీ: నగరానికి చెందిన ఓ మహిళ అదృశ్యంపై ఆదివారం సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. నగరంలోని బృందావనం ప్రాంతంలో దండు అంజయ్య– రెడ్డమ్మ దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి ముగ్గురు సంతానం ఉన్నారు. అంజయ్య ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈనెల 27వ తేదీన రెడ్డమ్మ ఫోన్‌లో ఇతరులతో మాట్లాడుతుండగా భర్త చూసి మందలించాడు. దీంతో రెడ్డమ్మ గొడవ పెట్టుకుని ఇంటి నుంచి వెళ్లిపోతానని బెదిరించింది. అదేరోజు అంజయ్య తన తల్లిని చూసేందుకు పెంచలకోన వద్ద ఉన్న గరిమెనపెంటకు వెళ్లారు. ఈ సమయంలో పెద్ద కుమారుడు గిరి తండ్రి అంజయ్యకు ఫోన్ చేసి అమ్మ బ్యాగ్ తీసుకుని ఆమె బంధువులు ఉంటున్న రైల్వే కోడూరుకు వెళ్తున్నట్లు చెప్పారు. దీంతో అంజయ్య హుటాహుటిన రైల్వేకోడూరుకు వెళ్లి రెడ్డమ్మ ఆచూకీ కోసం విచారించగా ఆమె అక్కడికి రాలేదని చెప్పారు. దీంతో ఆదివారం అంజయ్య సంతపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నెల్లూరు సిటీ: రూరల్ నియోజకవర్గంలోని 20వ డివిజన్ కావేరి అవెన్యూలో రూ.27 లక్షలతో సీసీరోడ్డు, డ్రెయిన్ పనులకు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో 20వ డివిజన్ అభివృద్ధికి రూ.4.5 కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు మదన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



నెల్లూరు(అర్బన్): ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. డైకస్‌రోడ్డులోని వియానిహోమ్‌లో రిచ్ చిన్నపిల్లల ఆస్పత్రి, సాయిచేతన్ ఆస్పత్రి, మెడికవర్ ఆస్పత్రి, రామ్స్ డెంటల్ వరల్డ్ అండ్ కిడ్స్ డెంటల్ వరల్డ్ సహకారంతో మెగా మెడికల్ క్యాంప్‌ను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ సమతుల్య ఆహారం, కలుషితం లేని వాతావరణం, పరిశుభ్రత, రక్షిత తాగునీటితో మనం ఎంతో ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. అందువల్ల ప్రజలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పీహెచ్‌పీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్ మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు, ట్రస్ట్‌ల ద్వారా ఇలాంటి మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ శిబిరంలో సాధారణ వ్యాధులతో పాటు గైనకాలజీ, డెంటల్ లాంటి చికిత్సలు అందించి ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ మాల్యాద్రి, డాక్టర్ ఝాన్సీరెడ్డి, డాక్టర్ సోనియా, డాక్టర్ నాషిన్, పీహెచ్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోరంట్ల శేషయ్య, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రసూల్, జయ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి మృతి

నెల్లూరు సిటీ: ఓ వ్యక్తి రోడ్డు పక్కన మృతిచెందిన ఘటనపై ఆదివారం కేసు నమోదైంది. ప్రాథమిక సమాచారం మేరకు.. నెల్లూరు నగరంలో కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్న మస్తాన్(47) అనే వ్యక్తి ఆదివారం నగరంలోని స్టోన్‌హౌస్‌పేట వద్ద ఉన్న దుర్గా హోటల్ సమీపంలో రోడ్డుపై మృతిచెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అనారోగ్య కారణంగా మృతిచెంది ఉంటాడని సమాచారం. అయితే పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అలుపెరగని పోరాటం చేస్తాం



పోస్టర్లను చూపుతున్న నాయకులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: కార్మిక వ్యతిరేక విధానాలపై అలుపెరగని పోరాటం చేస్తామని ఆటో కార్మికుల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మారుబోయిన రాజా, కోలగట్ల సురేష్ అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో జిల్లా ఆటోకార్మిక సంఘం ఆరో మహాసభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు వ్యతిరేకంగా అనుసరిస్తున్న విధానాలపై ఎప్పటికప్పుడు నిరసన కార్యక్రమాలు చేస్తున్నామన్నారు.

కూటమి ప్రభుత్వం వాహనమిత్ర పథకాన్ని అమలు చేస్తామని చెప్పి ఇప్పటివరకు దీని గురించి పట్టించుకోవడం లేదన్నారు. తొలుత పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆటోకార్మిక సంఘం నాయకులు రాధయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ ఏకపక్ష నిర్ణయాలు తగవు



కౌన్సిల్ సమావేశంలో కమిషనర్‌ను ప్రశ్నిస్తున్న ప్రమీలమ్మ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ కమిషనర్ ఏకపక్ష నిర్ణయాలు తగదని 16వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ బిట్రగుంట ప్రమీలమ్మ అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో అజెండాలోని రెండో అంశంపై ఆమె మాట్లాడుతూ బెజవాడ గోపాల్‌రెడ్డి కాంప్లెక్స్‌కు సంబంధించి షాపు నంబర్ 7కు మే నెలలో వేలం నిర్వహించారన్నారు. అయితే వేలంపాటలో షాపును దక్కించుకున్న హెచ్చు పాటదారుడు బక్కా రమణయ్య తనకు షాపు వద్దని కమిషనర్‌కు నివేదించారన్నారు. దీనిపై సదరు వ్యక్తిపై చర్యలు తీసుకునే విషయాన్ని కమిషనర్ అజెండాలో చేర్చి చైర్‌పర్సన్ ఆమోదం కోసం ఉంచారన్నారు. అయితే ఉక్కాల రాజేశ్వరమ్మ, బైన హేమలత కాంప్లెక్స్‌లో షాపు నంబర్–1 దక్కించుకున్న పాటదారుడు కూడా మళ్లీ తనకు షాపు వద్దని లిఖితపూర్వకంగా అర్జీ సమర్పించారన్నారు.

అయితే వీరి పేరును, కలిగించిన నష్టం గురించి కమిషనర్ ఎందుకు అజెండాలో చేర్చలేదో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. వేలం పాటలంటే పోటీ ఉంటుందని అలాంటప్పుడు ఒకరిపై సానుభూతి, మరొకరిపై చర్యలకు పూనుకోవడం సరికాదన్నారు. అలాగే మంగళకట్ట వద్ద ఉన్న జగనన్న లేఅవుట్‌లో ఇళ్లపై వెళ్తున్న విద్యుత్ లైన్లు, స్తంభాలు వేసేందుకు విద్యుత్‌శాఖ వారికి రూ.1,23,759లను నగర పంచాయతీ సాధారణ నిధుల నుంచి చెల్లించాలని అజెండాలో నమోదు చేశారన్నారు. విద్యుత్‌శాఖ వారు చేసిన తప్పునకు నగర పంచాయతీ నుంచి నిధులు చెల్లించడం ఏమిటని ఆమె కమిషనర్‌ను ప్రశ్నించారు. తమకు కౌన్సిల్‌లో బలం లేదని ఇష్టారీతిన నిర్ణయాలు తీసుకుంటే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని వివరించారు.

ఏమరుపాటుగా ఉంటే అంతే..



ఇనుకుర్తి వద్ద ప్రమాదకరంగా ఉన్న రోడ్డు మలుపు

పొదలకూరు: మండలంలోని రాపూరు మార్గంలో గల ఇనుకుర్తి జెడ్పీ హైస్కూల్, మద్రిపల్లి వద్ద ఉన్న మలుపులు ప్రాణాంతకంగా మారుతున్నాయి. తరచూ సంభవిస్తున్న రోడ్డు ప్రమాదాల్లో వాహనచోదకుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. డబుల్ రోడ్డయినా, మలుపు వద్ద అప్రమత్తంగా లేకుండా వాహనాలను నడిపితే ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇక్కడ జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పలువురు మృత్యువాతపడ్డారు. ఆటోలు, ట్రాక్టర్లు, ద్విచక్రవాహన ప్రమాదాల్లో అక్కడికక్కడే మృత్యువాత పడిన ఘటనలూ ఉన్నాయి. ఇనుకుర్తి మలుపు దాటిన వెంటనే రోడ్డు పక్కన జెడ్పీ హైస్కూల్‌తో పాటు, శ్రీకాంతమ్మతల్లి, వెంకయ్యస్వామి ఆశ్రమాలు పక్కపక్కనే ఉన్నాయి. అలాగే మద్రిపల్లి చెరువు దాటిన తర్వాత మలుపు సైతం ప్రమాదకరంగా మారింది. ఆటోల్లో ప్రయాణించే ప్రయాణికులు నిత్యం ఎక్కుతూ దిగుతూ ఉంటారు. అంతేకాక ఇదే రహదారిపై కంకర తరలించే టిప్పర్లు వేగంగా వెళ్తున్నాయి. ఈ నేపథ్యంలో మలుపుల వద్ద ప్రమాదాలు తరచూ సంభవిస్తున్నాయి.

యోగాపై శిక్షణ



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో యోగాపై శిక్షణా కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. శిక్షకుడు సురేష్‌రెడ్డి ఆసనాలు వేయించి, యోగా ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో దేవస్థానం కార్య నిర్వహణాధికారి కోవూరు జనార్ధన్‌రెడ్డి, సిబ్బంది, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడిగా కామేశ్వర ప్రసాద్



నెల్లూరు(బృందావనం): ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడిగా నెల్లూరుకు చెందిన ఇసుకపల్లి కామేశ్వరప్రసాద్ ఎన్నికయ్యారు. పల్నాడు జిల్లా వినుకొండలోని బీఈడీ కళాశాల ప్రాంగణంలో సమాఖ్య రాష్ట్ర సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఇందులో రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోగా, సంఘ అధ్యక్షుడిగా కామేశ్వరప్రసాద్‌తో మరికొందరు సభ్యులను నియమించారు. నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం జూలై 13న నెల్లూరులో జరుగనుంది.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం



మాట్లాడుతున్న కాకాణి పూజిత

తోటపల్లిగూడూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సర్వేపల్లి నియోజకవర్గ నేతలు, కార్యకర్తలకు అండగా ఉంటానని మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె కాకాణి పూజిత పేర్కొన్నారు. వరకవిపూడిలోని సర్పంచ్ ఇసనాక రమేష్‌రెడ్డి నివాసంలో పార్టీ శ్రేణులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జెడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా, మంత్రిగా విలువలతో కూడిన రాజకీయాన్ని తన తండ్రి కాకాణి చేశారని చెప్పారు. అవినీతికి తావు లేకుండా సర్వేపల్లి నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్నారనే నెపంతో అక్రమ కేసులు పెట్టి జైల్లో నిర్బంధించారని ఆరోపించారు. తొందర్లోనే కడిగిన ముత్యంలా బయటకొస్తారని తెలిపారు. అక్రమ అరెస్ట్‌తో తనతో పాటు పార్టీ కార్యకర్తలు చాలా బాధలో ఉన్నారని, అందరూ ధైర్యంగా ఉండాలని కోరారు. అధికార పార్టీ వేధింపులకు భయపడకుండా తనకు ధైర్యం చెప్పన్నారని, అందరికీ రుణపడి ఉంటానన్నారు. తన తండ్రి విడుదలయ్యేంత వరకు నియోజకవర్గ పార్టీ శ్రేణులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి, మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, జెడ్పీటీసీ సభ్యులు ఎంబేటి శేషమ్మ, ఎంపీపీ ఉప్పల స్వర్ణలత, వైస్ ఎంపీపీ చెరుకూరు శ్రీనివాసుల నాయుడు, నేతలు ఇసనాక రమేష్‌రెడ్డి, మన్నెం చిరంజీవులుగౌడ్, తలమంచి సురేంద్రబాబు, మన్నెం సుబ్రహ్మణ్యంగౌడ్, గంగాధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గాయత్రీ మహాయజ్ఞం

నెల్లూరు(బృందావనం): నగరంలోని సర్వోదయ కళాశాల ప్రాంగణంలో ఆదివారం 108 కుండముల గాయత్రీ మహాయజ్ఞాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తీర్థ్ శాంతికుంజ్, హరిద్వార్ ఉత్తరాంచల్ పండితుల ఆధ్వర్యంలో యజ్ఞం చేపట్టినట్లు జిల్లా గాయత్రీ పరివార్ నిర్వాహకులు తెలిపారు.



వేపతో పంటలకు రక్ష

- ఖర్చు తక్కువ, ఆదాయం ఎక్కువ

కోవూరు: వేప ఉత్పత్తులు మానవునితో పాటు వివిధ పంటల రక్షణకు అత్యంత దోహద పడుతున్నాయి. వేప చెట్టులో వేరు మొదలుకుని బెరడు, ఆకులు, పువ్వులు, పండ్లు, విత్తనాలు ఇలా అన్ని భాగాల్లో ఔషధ గుణాలు కలిగి ఉంటాయి. దీనివల్ల వేప ఉత్పత్తులను సాగులో వాడితే ఖర్చు ఆదా అవుతుంది. ఆశించిన రీతిలో దిగుబడులు వస్తాయి. ముఖ్యంగా నాణ్యమైన, ఆరోగ్యకర ఆహార ఉత్పత్తులు చేతికి అందుతాయి.

అనేక పంటలకు ఉపయోగం

వేపలో అజాడిరాక్టిన్ అనుకూల పదార్థం కలదు. దీనికి 300 రకాల కీటకాలు, నల్లిజాతి పురుగులు, చెదలు, కొన్ని రకాల బూజు శిలీంద్రాల్ని అరికట్టే శక్తి ఉంటుంది. ఇది వరి, పత్తి, అపరాలు, కూరగాయలు, పండ్ల మొక్కలు, కాఫీ, జొన్న, ఉద్యాన పంటల్లో వచ్చే కీటకాల్ని అరికడుతుంది. మార్కెట్లో వేపపిండి, వేపనూనె, వేప కషాయం వంటి వివిధ రకాల వేప ఉత్పత్తులు లభిస్తున్నాయి.

సూచనల మేరకు వాడాలి

నీమ్ ఆయిల్‌ను స్థానిక వ్యవసాయ నిపుణుల సూచన మేరకు వాడితే కీటకాల పెరుగుదలను నిరోధిస్తుంది. ఈ మందును స్ప్రే చేసినప్పుడు పురుగులకు వికారం కలిగించి పైరును తినకుండా చేస్తుంది. వీటిలో విష పూరిత అవశేషాలుండవు. ఈ మందు పక్షులు, మానవులు, మిత్ర పురుగులు, తేనెటీగలు వంటి జీవాలకు హాని చేయదు. సమగ్ర సస్యరక్షణ విధానంలో ఈ మందులు బాగా ఉపయుక్తమవుతాయి.

ఇలా చేయాలి

పైరుపై పురుగు ఆశించిన వెంటనే పిచికారీ చేయాలి. తల్లి పురుగు గుడ్లు పెట్టినట్లు గమనించిన వెంటనే చేస్తే ఇంకా మంచిది. ఎకరాకు మూడు నుంచి ఐదు మిల్లీలీటర్ల నీమ్ ఆయిల్‌ను లీటరు నీటిలో కలిపి స్ప్రే చేయాలి. వాతావరణం చల్లగా ఉన్న సమయాల్లో (ఉదయం లేక సాయంత్రం) పిచికారీ చేయాలి. ఏడు నుంచి 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేసుకోవాలి. పిచికారీ చేసిన తర్వాత ఆరు గంటల వ్యవధిలోపు వర్షం పడితే మళ్లీ చల్లాల్సిందే.



తెగుళ్ల నివారణ ఇలా..

వివిధ పంటల్లో వేప మందుల వాడకంతో పలు రకాల చీడపీడల్ని నివారించుకోవచ్చు. వరి పంటకు సంబంధించి ఎకరాకు 150 నుంచి 200 కిలోల వేపపిండిని దమ్ములో వేయడం వల్ల కాండం తొలిచే పురుగు, ఉల్లికోడును అదుపు చేయవచ్చు. వరిపైరుపై లీటరు నీటికి మూడు మిల్లీలీటర్ల చొప్పున కలిపిన ద్రావణాన్ని ఎకరాకు 200 లీటర్ల చొప్పున పిచికారీ చేస్తే అగ్గి తెగులు, తొడిమికుళ్లు, పొడ తెగులు తదితరాలను అదుపు చేసుకోవచ్చు.

ఇంట్లోనే వేప కషాయం తయారీ

పంటకు అవసరమైన వేప కషాయాన్ని కూడా ఇంట్లోనే తయారు చేసుకోవచ్చు. ఇందుకు ఐదు కిలోల వేప గింజలను నలగగొట్టి, ఆరు నుంచి ఏడు లీటర్ల నీటిలో ఒకటి నుంచి రెండు రోజులు నానబెట్టాలి. దీనిని వడకట్టి నీటిని కలపాలి.



పోషక విలువలు అపారం



వేప ఉత్పత్తుల్లో అనేక రకాల పోషకాలు ఉంటాయి. వేప పిండిని ఎక్కువగా వరి పంట, నిమ్మ తోటలకు వాడవచ్చు. దీనివల్ల పలు రకాల తెగుళ్లను అదుపు చేయవచ్చు.

– అనిత, ఏడీఏ, కోవూరు